క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. ఎక్సైజ్ కాలనీ, కనకదుర్గ కాలనీ, భవాని నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కల్పనకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు కల్పన బల్లోజుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎంప్లాయ్ మోటివేషన్ ఇన్ బ్యాంకింగ్ ఇండస్ట్రీ – ఎ సెలెక్ట్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కల్పనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. వరంగల్ సీకేఎం విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ ఎస్.ఉపేంద్రశాస్త్రి పర్యవేక్షణలో కల్పన తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. హనుమకొండకు చెందిన కల్పన ప్రస్తుతం హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు.

డంపింగ్ యార్డును తొలగించాలని పాదయాత్ర



మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండ – రాంపూర్ మధ్యలో ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని హనుమాన్ మాలధారులు కోరారు. ఈమేరకు ఇరు గ్రామాలకు చెందిన మాలధారులు కొండగట్టు అంజన్న ఆలయానికి పాదయాత్రగా ఆదివారం బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ సమస్యతో చుట్టుపక్కల 10 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తరలివెళ్లిన వారిలో దువ్వ నవీన్, రాజేంద్రప్రసాద్, ఆకుల శరత్, కుక్కల రంజిత్, బైరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకర్ ఢీ.. వృద్ధుడి దుర్మరణం



యాకయ్య (ఫైల్)

మామునూరు: సెప్టిక్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన ఆదివారం సాయంత్రం ఖిలా వరంగల్ మండలం అల్లీపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం అల్లీపురం గ్రామానికి కొత్తపెల్లి యాకయ్య (85) వ్యక్తిగత పనులపై రోడ్డుపైకి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సెప్టిక్ ట్యాంకర్ వెనుకకు తీస్తున్న సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యాకయ్యను బలంగా ఢీకొట్టింది. దాంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు చక్రపాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

నగరంలో చైన్ స్నాచింగ్


రామన్నపేట: వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు పుస్తెల తాడును లాక్కొని వెళ్లిన సంఘటన మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మట్టెవాడలోని కాకతీయ టాకీస్ వెనకాల ఉన్న తన ఇంట్లో ఒంటరిగా వింతంతు వృద్ధురాలు రేకులపల్లి నర్సమ్మ నిద్రిస్తోంది. సుమారు మధ్యరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆ ఇంటి తలుపులు కొట్టి 'మీ కొడుకు రాజు.. కాకతీయ టాకీస్ సమీపంలో పడిపోయాడని, నేను తీసుకొచ్చాను' అని అన్నాడు. దాంతో వృద్ధురాలు తలుపు తీయగా, వెంటనే ఆమె మెడలో ఉన్న రెండు వరుసల బంగారు పుస్తెల తాడు (రెండున్నర తులాలు)ను గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని పారిపోయాడు. బాధితురాలు నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

కమలాపూర్ : గుర్తు తెలియని దుండగులు 10 వ్యవసాయ విద్యుత్ మోటార్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన అంబాల, శ్రీరాములపల్లి గ్రామాల శివారులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఆయా గ్రామాల రైతులు తెలిపిన వివరాల ప్రకారం యాసంగి పంట సాగు కోసం అంబాల, శ్రీరాములపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఎస్సారెస్పీ కాల్వలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు అమర్చుకుని పంటలు సాగు చేశారు. రైతులు పంట విక్రయాల్లో నిమగ్నం కావడంతో, ఇదే అదనుగా భావించిన దుండగులు ఆ మోటార్లపై కన్నేశారు. కుమ్మరి శ్రీకాంత్, సాంబయ్య, గోల్కొండ అనిల్, రమేశ్, శంకరయ్య, ఉడుతనబోయిన కొమురయ్య, మొట్టుపెల్లి రాజేందర్, మంతుర్తి రవి, జేరుపోతుల భిక్షపతి అమర్చుకున్న 10 మోటార్లను ధ్వంసం అందులోని సుమారు రూ.21,500 విలువచేసే 43 కిలోల కాపర్ వైరును ఎత్తుకెళ్లారు.



కాజీపేట బ్రిడ్జిపై శిథిలావస్థకు చేరిన ప్రహరీ



అధ్వానంగా మారిన మెట్ల దారి



మూసి వేసిన మెట్లదారి

భయం భయంగా ప్రయాణం

- శిథిలావస్థకు చేరుకున్న కాజీపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి
- నూతన వంతెన వినియోగంలోకి వస్తే తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

కాజీపేట: కాజీపేట నుంచి వెళ్తున్న రైల్వేలైన్‌తో ఎలాంటి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సుమారు 4 దశాబ్దాల కాలం క్రితం అప్పటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. ఇటీవల కాలంలో వంతెన నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంతో ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారుతోంది. ఈ వంతెనకు సమాంతరంగా నిర్మిస్తున్న నూతన వారధి వినియోగంలోకి వస్తే ట్రాఫిక్ కష్టాలు, వంతెనపై జరిగే రోడ్డు ప్రమాదాలు తీరనున్నాయి.

ఏపుగా పెరిగిన చెట్లు..

ఫాతిమానగర్ నుంచి రైల్వేలైన్ మీదుగా కాజీపేట ఎఫ్‌సీఐ ప్రధాన గేట్ వరకు ఈ బ్రిడ్జి విస్తరించి ఉంది. ఎన్‌హెచ్ అధికారులు అప్పుడప్పుడు మరమ్మతుల కోసం రూ.లక్షల్లో వ్యయం చేస్తూ మమ అనిపిస్తున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా నిర్మించిన రెయిలింగ్‌లు బీటలువారి ఎప్పుడు కూలిపోతాయో తెలియని



బ్రిడ్జి పిల్లర్ల మధ్య ఏపుగా పెరిగిన చెట్టు

దుస్థితి నెలకొంది. బ్రిడ్జి గోడలపై చెట్లు మొలిచి ఏపుగా పెరుగుతున్నాయి. వాటి వల్ల గోడలు పగుళ్లు తేలుతున్నాయి. బ్రిడ్జి కింది భాగం శిథిలావస్థకు చేరినట్లుగా కనిపిస్తోంది. మెట్ల రహదారులు పూర్తిగా ధ్వంసం కావడంతో ట్రాఫిక్ పోలీసులు ఆ దారిని పూర్తిగా మూసివేశారు. రాష్ట్ర రాజధాని వైపు వెళ్లడానికి, హైదరాబాద్ నుంచి నగరానికి రావడానికి ప్రజలకు ఉన్న బ్రిడ్జి ఇదొక్కటే కావడం గమనార్హం. అధికారులు చొరవ తీసుకుని బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఇటీవల కారు ఢీకొనడంతో రెయిలింగ్ స్థానంలో నిర్మించిన సిమెంట్ గోడ

తిరంగా యాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కొలను సంతోష్‌రెడ్డి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి

హన్మకొండ: ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని భారత సాయుధ దళాలకు కృతజ్ఞత తెలుపుతూ ఈనెల 19న చేపట్టనున్న తిరంగా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ పిలుపునిచ్చారు. హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, నగరంలోని డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ యాత్ర పూర్తిగా రాజకీయేతమైనదని స్పష్టం చేశారు. ఎలాంటి పార్టీ చిహ్నాలు, నాయకుల ఫొటోలు, బ్యానర్లు, బ్రాండింగ్ లేకుండా కేవలం జాతీయ పతాకంతోనే యాత్ర నిర్వహించాలని సూచించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల పట్ల గౌరవాన్ని వ్యక్తపరుస్తూ ఈ కార్యక్రమం కొనసాగాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సోమవారం సాయంత్రం హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జరగనున్న తిరంగా యాత్రలో కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, దొంతి దేవేందర్ రెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు, ఆర్‌పి.జయంత్ లాల్, బైరి లక్ష్మి, అరణ్యరెడ్డి పాల్గొన్నారు.

సీఎం సలహాదారుకు స్వాగతం



హసన్‌పర్తి: నగరంలోని చింతగట్టు క్యాంప్ వద్ద జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయనకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, బల్సుకూరి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, దేవస్థాన ధర్మకర్తలు కనపర్తి రాజు, కొండమీది సంతోష్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ జోలికొస్తే ఊరుకోం..'

రామన్నపేట: ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల తరపున ప్రభుత్వాన్ని పోరాడుతామని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, కార్యాలయాల జోలికి వస్తే ఊరుకునేంది లేదని మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ హెచ్చరించారు. 29వ డివిజన్ బీఆర్‌ఎస్ డివిజన్ యూత్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రాన్ని సాధించిన తాము బెదిరింపులకు భయపడబోమని అన్నారు. డివిజన్‌లో గత ప్రభుత్వ హయాంలో రూ.27 కోట్ల నిధులతో 344 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. 1200 పైగా పెన్షన్లు అందించామని, 500 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. 16 నెలల పాలనలో అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సదాంత్, మాజీ కార్పొరేటర్ వద్దిరాజు గణేష్, నాయకులు షఫి, రమేష్, చందు, రాజు, తహసీల్, నాగమణి, లక్ష్మి, రహీం, శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కమలాపూర్ : నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. కమలాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి నేర వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. సిబ్బందితో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులకు ఓటీపీలు చెప్పవద్దన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

రామన్నపేట: నగరంలోని పోచమ్మమైదాన్ చౌరస్తాలో వాక్ ఫౌండేషన్ తరపున ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు చల్లని మజిగ్గ ప్యాకెట్లు, తాగునీరు అందించారు. 18 ఏళ్లుగా జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న వాక్ ఫౌండేషన్ ప్రతినిధులను వారు అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, వన్నాల శ్రీరాములు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, మాదాసు రాజు, మార్టిన్ లూథర్, బైరి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధమవుతూ.. కానరాని లోకాలకు

- వరి మొదళ్లకు నిప్పు పెడుతూ ఊపిరాడక పొలంలో రైతు మృతి
- నర్సక్కపల్లిలో విషాదఛాయలు

నడికూడ: కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన అన్నదాత పొలంలోనే ప్రాణాలు విడిచాడు. వరి మొదళ్లకు నిప్పు పెడుతుండగా గడ్డి కట్టలకు మంటలు వ్యాపించి ఊపిరాడక కుప్పకూలిపోయాడు. సమీపంలో ఎవరూ గమనించకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ హృదయ విదారక ఘటన మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆముదాపురం శంకర్‌రావు (65)కు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈక్రమంలో ఆదివారం తన పొలంలోని వరి మొదళ్లకు నిప్పు పెడుతున్నాడు. దీంతో పక్కన నిల్వ ఉన్న గడ్డి కట్టలకు మంటలు అంటుకున్నాయి. మంటలు ఆర్పే క్రమంలో వేడికి గురైన శంకర్‌రావు.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సమీపంలో ఉన్నవారు ఇచ్చిన సమాచారంతో వెంటనే కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. శంకర్‌రావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయమై పరకాల పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



ఊపిరాడక గడ్డి కట్టల వద్ద మృతిచెందిన శంకర్‌రావు

కార్పొరేటర్‌పై పెట్టిన కేసు ఎత్తివేయాలి



పోలీస్ స్టేషన్‌లో ఆవరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సారయ్య, పక్కన ఎర్రబెల్లి స్వర్ణ



బాధితురాలితో కలిసి మాట్లాడుతున్న మంద కుమార్‌మాదిగ

ఖిలా వరంగల్: వరంగల్ 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు, సమాజంలో గౌరవం ఉన్న వ్యక్తిపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని అన్నారు. త్వరలోనే నిర్దోషిగా బయటకు వస్తాడని తెలిపారు. కక్షసాధింపు వల్ల అక్రమ కేసులు పెడుతున్నారని, న్యాయం కార్పొరేటర్ వైపు ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని వారు చెప్పారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట పద్మశాలీల నిరసన

కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై తప్పుడు కేసులు పెట్టారంటూ ఆదివారం సాయంత్రం పార్టీలకు అతీతంగా పద్మశాలి కుల ప్రతినిధులు అధిక సంఖ్యలో మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్రమ కేసులు ఎత్తివేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు కుసుమ సతీష్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా ఏమైనా విబేధాలు ఉంటే వాటిని వ్యక్తిగతంగా ఒక వ్యక్తిపై చూపించడం, బూటకపు కేసులు పెట్టడం సరైనది కాదని అన్నారు. కార్యక్రమంలో డీఎస్.మూర్తి, గోరంట్ల రాజు, మురళీకృష్ణ, కూచన క్రాంతి, బైరి శ్యామ్, కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నరేందర్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

కాంగ్రెస్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ అక్రమ అరెస్టును బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని, బేషరుతుగా వెంటనే విడుదల చేయాలని బీజేపీ నేత, అర్బన్ కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. నరేందర్ అక్రమ అరెస్టును బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఖండించారు. దీన్ని బీఆర్‌ఎస్ తరఫున ఖండిస్తున్నట్లు తెలిపారు.

కార్పొరేటర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

కులంపేరుతో దూషించి, మహిళ నాయకురాలిపై అత్యాచార యత్నానికి పాల్పడిన కార్పొరేటర్ గుండేటి నరేందర్‌ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీస్, ఎంఎస్పీ ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయ కర్త మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ వద్ద బాధిత మహిళతో కలిసి ఆయన ఆదివారం మాట్లాడారు. దళిత కాంగ్రెస్ పార్టీ నాయకురాలిపై అదే పార్టీకి చెందిన కార్పొరేటర్ అనుచితంగా ప్రవరించడమే కాకుండా కులంపేరుతో దూషించాడని అన్నారు. అలాంటి వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచార యత్నం కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణం

- స్థలం సేకరించిన అధికారులు
- హసన్‌పర్తి, రెడ్డిపురం గ్రామాల్లో ఏర్పాటు

హసన్‌పర్తి: నగర పరిధిలో కొత్తగా రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం హసన్‌పర్తి, రెడ్డిపురం గ్రామాల్లో స్థలాలను సేకరించారు. ఈమేరకు రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించారు. హసన్‌పర్తి పరిధిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్తగా సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు రూపొందించారు. అప్పుడే కొత్తగా సబ్‌స్టేషన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. అయితే, స్థల సేకరణ అడ్డుగా మారడంతో జాప్యం జరిగింది. ఇటీవల 'ప్రభుత్వ స్థలం లేదటా' అనే కథనం 'సాక్షి'లో వెలువడింది. దాంతో రెవెన్యూ అధికారులు స్పందించి హసన్‌పర్తి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 180 మిషన్ భగీరథ కార్యాలయం పక్కన స్థలం అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. అలాగే, పెగడపల్లి రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 410లో కూడా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని సేకరించినట్లు విద్యుత్ అధికారులు చెప్పారు. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం 20గుంటల చొప్పున భూమిని గుర్తించారు.



నాలుగు గ్రామాలకు..

హసన్‌పర్తిలో సబ్‌స్టేషన్ ఏర్పాటు వల్ల హసన్‌పర్తి, పెంబర్తి, గంటూరుపల్లి, సీతంపేట గ్రామాల ప్రజలకు కరెంట్ కష్టాలు తీరనున్నాయి. రెడ్డిపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు వల్ల పెగడపల్లి, వంగపహాడ్, సీతానాగారం గ్రామస్తులకు విద్యుత్ సమస్య తీరనుంది.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



నగదు, సెల్‌ఫోన్లు చూపిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధి రెడ్డికాలనీలోని నిర్వాహకుడు మహేందర్ ఇంట్లో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేసి ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.21,200, ఐదు మొబైల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. దబ్బాల జంక్షన్‌కు చెందిన వాలిపి వెంకటేశ్వర్లు, భూతం సాంబ, గోకుల నగర్‌కు చెందిన బహదూర్ సన్‌తీష్, సుధానగర్‌కు చెందిన సుధాపతి శ్రీనివాస్, యాదవనగర్‌కు చెందిన మూల శ్రీధర్, సకినాల రమేష్, మచిలీబజార్‌కు చెందిన నానెట్ట పవన్ పట్టుబడగా, మరో ఇద్దరు మహేందర్, నాయుడులు పరారీలో ఉన్నట్లు వివరించారు. తదుపరి చర్యల నిమిత్తం కేసును హనుమకొండ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జి.బాబులాల్, ఎస్సై వి.దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ

- ధ్యానం తూకం వేయరు.. మిల్లులకు పంపరు
- గన్నీ సంచుల కొరత.. లారీల సమస్య
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న సూదన్‌పల్లి గ్రామ రైతులు

హసన్‌పర్తి: కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తోంది. హసన్‌పర్తి మండలం సూదన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఈ దుస్థితి నెలకొంది. రెండు రోజుల క్రితం ఆరబెట్టి ధాన్యం భారీ వర్షానికి ముద్దైంది. మరలా ఆ ధాన్యాన్ని సదరు రైతులు ఆరబెట్టారు. అయితే, శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మళ్లీ తడిసింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తూకం వేసిన ధాన్యం పంపించడానికి లారీల సమస్య నెలకొంది. రోజుకు నాలుగు లారీలు రావాల్సి ఉండగా, నాలుగు రోజుకొక్కటి కూడా రావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెల క్రితం కొనుగోళ్లు ప్రారంభం

మల్లారెడిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సూదన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. నెల రోజుల క్రితమే ఇక్కడ కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ గ్రామంలో ప్రతి ఏడాది సుమారు 6వేల క్వింటాళ్ల ధాన్యాన్ని పీఏసీఎస్ కొనుగోలు చేస్తోంది.

గన్నీ సంచుల కొరత

ప్రస్తుతం సీజన్‌లో గన్నీ సంచుల కొరత ఏర్పడింది. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి ్నప్పటికీ గన్నీ సంచులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెడుతున్నారు. వర్షాల కారణంగా ఆ ధాన్యం తడిసి ముద్దవుతోంది. పగలు ఎండబెట్టిన ధాన్యం రాత్రి వేళల్లో కురుస్తున్న అకాల వర్షాలకు తడిసి ముద్దవుతోందని అన్నదాతలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీసుకొచ్చిన వెంటనే ధాన్యాన్ని తూకం వేస్తే తమకు ఈ కష్టాలు తప్పుతాయి కదా అని అంటున్నారు. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి గన్నీ సంచులు సమకూర్చి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.



ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు



తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళ రైతు (ఫైల్)

క్రీడల్లో రాణించాలంటే సాధనే ముఖ్యం

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఐనవోలు : క్రీడల్లో రాణించాలంటే సాధనే కీలకంగా మారుతుందని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో యువత ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఐనవోలు క్రికెట్ ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలని చెప్పారు. పట్టుదల ఉంటేనే ఏదైనా సాధించవచ్చని, ప్రతీ రంగంలో గెలుపోటములు సహజమని, వాటిని పట్టించుకోకుండా నిరంతరం సాధన చేసి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. క్రికెట్ పోటీల్లో 30 టీంలు పాల్గొనగా, ప్రథమ బహుమతి ఐనవోలు రైసింగ్ స్టార్స్, ద్వితీయ బహుమతి ఐనవోలు యువసేన, తృతీయ బహుమతిగా ఖిలా వరంగల్ టీం నిలవగా ఆయన నగదు, షీల్డ్‌లను అందించారు.